క్లుప్తంగా

స్విమ్మింగ్‌లో ఎస్‌ఆర్ విద్యార్థిని సత్తా



తిమ్మాపూర్: స్విమ్మింగ్ పోటీల్లో కరీంనగర్ ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల ఫస్ట్ ఇయర్ విద్యార్థిని కీర్తి ధన్యశ్రీ సత్తాచాటింది. రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం గెలుచుకుందని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి తెలిపారు. హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జూలైలో జరిగిన తెలంగాణ 9వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో గ్రూప్ 1 విభాగంలో 1,500 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో ధన్యశ్రీ పాల్గొని ప్రతిభ చూపింది. నేదురు తిరుపతి, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు అభినందించారు. ధన్యశ్రీ తండ్రి చంద్రశేఖర్ అంబేడ్కర్ స్టేడియంలో కోచ్‌గా పని చేస్తూ ఆమె పతకం సాధించేందుకు కృషి చేశారు.

మొలంగూర్ క్రాస్ రోడ్డు మూసివేత



మూసివేసిన రోడ్డు

శంకరపట్నం: మొలంగూర్ క్రాస్ రోడ్డును జాతీయ రహదారి సంస్థ మూసివేసింది. గ్రామం నుంచి కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై వెళ్లేందుకు ఉన్న రోడ్డుపై ఫ్లయ్‌ఓవర్ నిర్మాణంలో భాగంగా బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారు. దీంతో రాకపోకలకు డైవర్షన్ చేస్తూ రోడ్డును మూసివేయించారు. రోడ్డుపై సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కార్యదర్శిని నియమించాలి

మానకొండూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో పర్మినెంట్ సెక్రటరీని నియమించాలని కోరుతూ గురువారం మాజీ ఎంపీటీసీ గోశెట్టి సత్యనారాయణ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. గ్రామానికి మూడుసార్లు తాత్కాలిక కార్యదర్శులను నియమించినా.. కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని, ఎలాంటి పనులు జరగడం లేదన్నారు. శానిటేషన్, నీటి సౌకర్యం, మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు.

పరామర్శ



దేవయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న వెంకటేశ్వర్‌రావు

రామడుగు: కోరటపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మన్నె దర్శన్‌రావు తండ్రి దేవయ్య అనారోగ్యంతో మృతిచెందగా.. గురువారం వారి కుటుంబాన్ని రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వేంకటేశ్వర్‌రావు పరామర్శించారు. మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కలిగేటి లక్ష్మణ్, మన్నె రవీందర్, జాన్ కేనడీ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చిగురుమామిడి: భూసమస్యల కోసం తహసీల్ కార్యాలయానికి వచ్చేవారితో సక్రమంగా ప్రవర్తించి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కరీంనగర్ ఆర్డీవో కె.మహేశ్వర్ ఆదేశించారు. గురువారం చిగురుమామిడి తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ధరణి రిజిస్టర్లు, ఇతర రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో ఏమైనా సమస్యలున్నాయా అని వారిని ప్రశ్నించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కింద కాల్వల తవ్వకం కోసం 217 ఎకరాల భూసేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలో 13 మంది తహసీల్దార్లు బదిలీ అయినట్లు ఆర్డీవో తెలిపారు.

బస్టాండ్ పరిశీలించిన డీఎం

శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్‌ను గురువారం హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ పరిశీలించారు. బస్టాండ్‌లో సౌకర్యాలు, వసతులపై ప్రయాణికులనడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

డైరెక్టర్లకు సన్మానం

చొప్పదండి: కాట్నపల్లికి చెందిన చుప్ప శ్రీనివాస్, కొత్తపల్లి నవీన్ చొప్పదండి ఏఎంసీ డైరెక్టర్లుగా నియామకమవ్వగా.. కాంగ్రెస్ కాట్నపల్లి గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించారు. చొప్పదండి పట్టణానికి చెందిన గోస్కుల కొమురెళ్ళి ఏఎంసీ డైరెక్టర్‌గా నియామకమవ్వగా.. పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కురుమ యువజన సంఘం అధ్యక్షుడు జిట్ట కుమార్, గుంటి రాజయ్య, బైర తిరుపతి, బైర కనకయ్య, గుంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి..

రుక్మాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన బి.రఘుకిషోర్‌ను పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఘనంగా సన్మానించారు.



రహదారిపై నాట్లు వేసి నిరసన

రామడుగు: గోపాల్‌రావుపేట నుంచి బూరుగుపల్లి వెళ్లే రహదారిపై వరి నాట్లు వేసి బీజేపీ నాయకులు గురువారం నిరసన తెలిపారు. బూరుగుపల్లి వెళ్లే రహదారిపై భారీగా గుంతలు పడడంతో ప్రయాణికులు నిత్యం నానా ఇబ్బందులు పడుతున్నారని, రహదారి పనులు చేపట్టాలని కోరారు. పోచంపల్లి నరేశ్, కళ్లెం శివ, బండారి శ్రీనివాస్, చిరంజీవి, రవి, పర్శరాం, తిరుపతి, వినయ్, మహేశ్ పాల్గొన్నారు.



రైతులతో బ్యాంక్ కిటకిట

శంకరపట్నం: మండలంలోని గ్రామీణ బ్యాంక్ గురువారం రైతులతో కిటకిటలాడింది. ప్రభుత్వం రైతులకు రూ.1.50లక్షలు రుణమాఫీ చేసింది. 900 మంది రైతులకు రూ.6కోట్లు మాఫీ అయినట్లు బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర తెలిపారు.



వరండాలో కార్యదర్శులు..

శంకరపట్నం: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సీజనల్ వ్యాధులు, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. మండలంలోని అధికారులు అధిక సంఖ్యలో హాజరవడంతో.. సమావేశ మందిరం నిండిపోయింది. దీంతో కార్యదర్శులను ఇలా ఆరుబయట వరండాలో కూర్చోబెట్టారు.

నిత్య వర్షాలతో రైతన్న ఆందోళన

- వేరు కుళ్లుతో తీరని నష్టాలు
- నల్లరేగడి నేలల్లో పరిస్థితి దయనీయం
- రామడుగు మండలంలో 4,065 ఎకరాల్లో పత్తి పంట సాగు



వెదిరలో ఎదుగుదల లేని పత్తి చేను

రామడుగు: పదిహేను రోజుల నుంచి నిత్యం వర్షాలు కురుస్తుండడంతో.. పత్తి పంటను సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి విత్తనాలు నాటిన తర్వాత మంచిగా మొలకెత్తడంతో మంచి దిగుబడులు వస్తాయని ఆనందపడ్డారు. అంతలోనే ప్రతిరోజు వాన పడడంతో పంట ఎదుగుదల లేకుండా పోయింది. వేరు కుళ్లతో తీరని నష్టం కలిగే ప్రమాదం ఏర్పడిందని మండల రైతులు వాపోతున్నారు.

వరికి అనుకూలం

వరుసగా కురుస్తున్న వర్షాలు వరి పంట సాగు చేసుకుంటున్న రైతులకు మేలు చేస్తోంది. వాన పడుతుండడంతో పంట పొలాలను దున్నుకొని వరి నాట్లు వేసుకుంటున్నారు. రామడుగు మండలంలోని 23 గ్రామాల్లో 4,065 ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. వెదిర, దేశరాజ్‌పల్లి, వెలిచాల, రామడుగు, మోతె, గోలిరామయ్యపల్లి, కోరటపల్లి, దత్తోజీపల్లి, గోపాల్‌రావుపేట, గుండి, లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లి గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఎకరానికి పది నుంచి పదిహేను క్వింటాళ్ల దిగుబడులు వచ్చే పంట సగానికి పడిపోయే పరిస్థితి ఉందని రైతులంటున్నారు. వర్షాలు తగ్గుముఖం పడితేనే కొంత ఆశించిన ఫలితాలను సాధించే అవకాశముందని, లేకుంటే తీరని నష్టం కలుగుతుందని రైతు రవీందర్‌రెడ్డి తెలిపారు.

దిగుబడి అత్తదనుకుంటే..



ఈసారి పత్తి మొలకెత్తడంతో మంచిగా దిగుబడి అత్తదని ఆశపడ్డ. రోజూ వానలు పడి ఎదుగుదల లేదు. చేనులో కలుపులు తీసి ఎరువులను కూడా వేసినం. తీరని నష్టం వచ్చే పరిస్థితులున్నయ్.

– నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, వెదిర

ఐదెకరాల్లో సాగు



ఐదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట వేసిన. వర్షాలు రోజూ పడుతుండడంతో చేనులో నీళ్లు నిలిచి మొక్కలు కుళ్లి చనిపోతన్నయ్. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి కనిపిత్తంది.

– ర్యాకం శ్రీనివాస్, రైతు, గణేశ్‌నగర్

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వర్షాలు కురుస్తుండడంతో పంటను కాపాడుకోడానికి తప్పకుండా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. పత్తి పంట ముంపునకు గురై మొక్కలు త్వరగా కోలుకోవాలంటే 19:19:19 లేదా 13:0:45 10 గ్రాములు లీటరు నీటికి లేదా యూరియా 10 గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. తెగుళ్ల నివారణ కోసం 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బండజిమ్ ప్లస్ మాంకోజెబ్ శిలీంధ్ర నాశిక మందులను లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేట్టు వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

– యాస్మిన్, ఏవో, రామడుగు

ఎస్సీ వర్గీకరణపై సంబరాలు

హుజూరాబాద్: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో పట్టణంలో ఎమ్మార్పీఎస్, అన్ని పార్టీల మాదిగ నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఊరేగింపు నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి, మంద కృష్ణ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రుద్రారపు రామచంద్రం, మారేపల్లి శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, వేల్పుల రత్నం, వేల్పుల ప్రభాకర్, తునికి వసంత్, తునికి సమ్మయ్య, పాడిశెట్టి వెంకటరాజం, డాక్టర్ శేఖర్, మిడిదొడ్డి శ్రీనివాస్, సమ్మయ్య, రామ్ రాజేశ్వర్, ఎల్లయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును స్వాగతిస్తున్నామని, గొప్ప తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు.



హుజూరాబాద్‌లో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

గన్నేరువరం: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొంకటి దేవరాజ్ ఆధ్వర్యంలో గునుకులకొండాపూర్‌లో సంబరాలు చేసుకున్నారు. కొంకటి సాయిగణేశ్, బోయిని హరీశ్, కిరణ్, అవినాశ్, బాలరాజు, తిరుపతి, నిశాంత్ పాల్గొన్నారు.

రామడుగు: తిర్మలాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మిఠాయిలు పంపిణీ చేసి టపాసులు కాల్చారు. తడగొండ శంకర్, తడగొండ సత్యరాజ్ వర్మ పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఇంజం వెంకటస్వామి, రేణుకుంట్ల సాగర్, అంబాల మధునయ్య, మేరే అరుణ్, వంతడుపుల సంపత్, పర్లపల్లి తిరుపతి, సమ్మయ్య తదితరులున్నారు.

సైదాపూర్: సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ అన్నారు.

గన్నేరువరం: కోర్టు తీర్పు హర్షణీయమని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు జెరిపోతుల మహేందర్ అన్నారు. గన్నేరువరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

జమ్మికుంట: ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

మానకొండూర్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా మాజీ కన్వీనర్ కోండ్ర శంకర్‌మాదిగ హర్షం వ్యక్తం చేశారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



హుజూరాబాద్‌లో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుజూరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం హుజూరాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందే రాధిక–శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రతాపతిరుమల్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, అపరాధ ముత్యంరాజు, కుమార్, సుశీల, కేసిరెడ్డి లావణ్య, రమాదేవి, నాయకులు సంగెం అయిలయ్య, ప్రతాపకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అవమానకరంగా మాట్లాడిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వైఖరికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు మధురానగర్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. మేచినేని నవీన్‌రావు, సాగి మహిపాల్‌రావు, ఉప్పుల గంగాధర్, తూం మల్లారెడ్డి, నాగారపు సత్యం తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ శేఖర్, సిద్ధం వేణు, నాయకులు గడ్డం నాగరాజు, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: సీఎం రేవంత్‌రెడ్డికి పదవిలో కొనసాగే అర్హత లేదని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు కట్టెకోల లక్ష్మణ్ విమర్శించారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. రవీందర్, శ్రీనివాస్, అనిల్, నాంపల్లి తదితరులు పాల్గొన్నారు.

ఈదులగట్టెపల్లిలో అధికారుల సర్వే

మానకొండూర్: ప్రతి ఏటా గ్రామంలో వరద నీటితో గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు పంచాయతీరాజ్ అధికారులు గురువారం ఈదులగట్టెపల్లి గ్రామంలో సర్వే చేపట్టారు. పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్, డీఈ రవిప్రసాద్, ఏఈ వెంకన్న మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు సందర్శించారు. ఊర చెరువు మత్తడి ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామంలోని ఏ ప్రదేశం నుంచి మత్తడి నీరు వెళ్తుందో గ్రామస్తులనడిగి తెలుసుకున్నారు. వరద నీటితో గ్రామంలో రెండు వైపులా రాకపోకలు బందవుతున్నాయని గ్రామస్తులు అధికారులకు వివరించారు. సమస్యను పరిష్కరించేందుకు అధికారులు కొలతలు నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీవో రాజేశ్వరావు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మీస సత్యనారాయణ, నాయకులు కొట్టె అంజిరెడ్డి, సంగ మల్లయ్య, టీపీ మమత తదితరులున్నారు.

నేత్రదానంపై అవగాహన

జమ్మికుంట: కొత్తపల్లి నివాసి బెజగం చంద్రమౌళి ఇటీవల మృతిచెందగా.. కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నరహరి అధ్యక్షతన నేత్రదానంపై అవగాహన, సంస్మరణ సభ నిర్వహించారు. కుమారుడు, కోడలు బెజగం రమేశ్–జ్యోతి, కూతుళ్లు, అల్లుళ్లు రజిత–సుధాకర్, రేణుక–మనోహర్‌రావు, రాణి–కృష్ణను అభినందించి జ్ఞాపిక అందజేశారు. ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, వ్యాపారులు బచ్చు వీరలింగం, జి.రాజమౌళి, గర్రెపెల్లి మనోహర్, వెంకటేశ్వర్లు, చిదురాల శ్రీనివాస్, బంధుమిత్రులు పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లలను వదిలిన ముదిరాజ్‌లు

ఇల్లందకుంట: వాగొడ్డురామన్నపల్లి ముదిరాజ్ మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్‌లోని కైకలూరు నుంచి రవ్వ, బొచ్చ, బంగారు తీగ, మెరిగె లాంటి చేప పిల్లలను తీసుకొచ్చి గురువారం మల్యాల పరిధిలోని చింతల చెరువులో వదిలారు.

బస్సులు నడపాలని వినతి

హుజూరాబాద్‌రూరల్: శాలపల్లి గ్రామ ప్రజలు గురువారం ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు వినతి పత్రం సమర్పించారు. గ్రామాలకు ఆర్డినరీ బస్సులను నడపాలని కోరారు.

గంజాయిపై ప్రత్యేక నిఘా

వీణవంక: ప్రతి గ్రామంలో గంజాయిపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఎవరైనా గ్రామాల్లో అనుమానాస్పద స్థితిలో కనిపిస్తే పోలీసులకు సమాచారమందించాలని జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గంజాయిపై అవగాహన కల్పించారు. ఎస్సై తిరుపతి, అధ్యాపకులున్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

వీణవంక: ఈనెల 6న బీసీల సమస్యల పరిష్కారానికి తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు మద్దుల ప్రశాంత్ పటేల్ కోరారు.

ముర్రు పాల ప్రాముఖ్యం గుర్తించాలి



చొప్పదండి: అవగాహన కల్పిస్తున్న అధికారులు



గంగాధర: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చొప్పదండి: కాట్నపల్లిలో గురువారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, పల్లె దవాఖాన డాక్టర్ సునీత మహిళలకు తల్లి పాల ప్రాముఖ్యం వివరించారు. పుట్టిన వెంటనే పిల్లలకు ముర్రు పాలు తాగించాలని సూచించారు. పోషకాహార ప్రాముఖ్యం గుర్తించాలని కోరారు. కార్యదర్శి స్వరూప, అంగన్‌వాడీ టీచర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: మధురానగర్ గ్రామ పంచాయతీ పత్తికుంటపల్లి గ్రామంలో గురువారం తల్లి పాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో తల్లి పాల ప్రాధాన్యంపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ కె.లక్ష్మి, ఏఎన్‌ఎం తిరుమల, ఆశ కార్యకర్త రాణి పాల్గొన్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన ట్రెయినీ కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న అజయ్‌యాదవ్

మానకొండూర్: మండలంలోని సమీకృత హాస్టల్, శ్రీనివాస్‌నగర్‌లోని కేజీబీవీ హాస్టళ్లను కరీంనగర్ జిల్లా ట్రెయినీ కలెక్టర్ అజయ్‌యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలుర హాస్టల్‌లో బాత్‌రూములు మరమ్మతు చేయించాలని, కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు ఆట వస్తువులు అందుబాటులో ఉంచాలన్నారు. కేజీబీవీలో రికార్డులను అప్‌డేట్ చేయాలని అన్నారు. వంట, స్టోర్ గదులను పరిశీలించి ప్రత్యేకాధికారికి సూచనలు చేశారు. ఎంఈవో మధుసూదనాచారి, ఆర్ఐ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తొలగించాలి



డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని ఆటోనగర్‌లో నిరుపేదలకిచ్చిన నివేశన స్థలాల్లో ఉన్న డంపింగ్ యార్డు తొలగించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆటోనగర్ నివేశన స్థలాల లబ్ధిదారులు బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డును సందర్శించారు. నిరుపేదలకు 2007లో నివేశన స్థలాల పట్టాలివ్వగా.. కొందరు నిర్మాణాలు చేసుకున్నారన్నారు. మరి కొందరు చేసుకోలేదని ఆ స్థలాలను మున్సిపల్ అధికారులు ఆక్రమించుకొని డంపింగ్ యార్డుకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. శీలం శ్రీనివాస్, పల్లపు రవి, గణేశ్, అప్పం మధు, మోతే స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



గంగాధర: జనార్దన్‌రెడ్డిని అభినందిస్తున్న సిబ్బంది

మానకొండూర్ రూరల్: సాధారణ బదిలీల్లో భాగంగా మండల తహసీల్దార్‌గా బి.రాజేశ్వరి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఈమె పెద్దపల్లిలో విధులు నిర్వహించారు. ఇక్కడ పని చేసిన సీహెచ్ రాజు కరీంనగర్ రూరల్ మండలానికి బదిలీ అయ్యారు.

శంకరపట్నం: శంకరపట్నం తహసీల్దార్‌గా బత్తుల భాస్కర్ గురువారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేసిన అనుపమ హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఎంపీడీవోగా..

రామడుగు: మండల తహసీల్దార్‌గా వెంకటలక్ష్మీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రామడుగు తహసీల్దార్‌గా పని చేసిన భాస్కర్ శంకరపట్నంకు బదిలీ కాగా.. వెంకటలక్ష్మీని రామడుగు తహసీల్దార్‌గా అధికారులు బదిలీ చేశారు. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు.

గంగాధర: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంపీవో జనార్దన్‌రెడ్డి గురువారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన ఎంపీడీవో రాము వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లగా.. ఎంపీవోకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంపీవోను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

చిగురుమామిడి: మండల పరిషత్ ఇన్‌చార్జి అభివృద్ధి అధికారిగా ఎండీ ఖాజామొయినోద్దీన్ గురువారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకున్న ఎంపీడీవో మధుసూదన్ పైచదువుల నిమిత్తం మూడు నెలలపాటు సెలవుపై వెళ్లారు. జెడ్పీ సీఈవో ఇదే కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఖాజామొయినోద్దీన్‌కు బాధ్యతలు అప్పగించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పది మంది బదిలీ అయ్యారు. మండల పంచాయతీ అధికారి పార్నంది శ్రవణ్‌కుమార్ రామడుగు మండలానికి బదిలీ అయ్యారు. చిగురుమామిడి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన జి.వెంకటరమణ ఆకునూర్‌కు బదిలీ అయ్యారు. పీచుపల్లిలో పని చేసిన శామారాణి నల్లరామయ్యపల్లికి, కొండాపూర్‌లో పని చేసిన జి.రాంకీ పెద్దపాపయ్యపల్లికి, గునుకులపల్లిలో పని చేసిన శ్రవణ్ కాట్రపల్లికి, నవాబుపేటలో పని చేసిన శ్రీకాంత్ బొమ్మకల్‌కు, సీతారాంపూర్‌లో పని చేసిన అనూష శంకరపట్నం మండలం అంబాలపూర్‌కు, రామంచలో పని చేసిన సుమంత్ గన్నేరువరం మండలం జంగపల్లికి, గాగిరెడ్డిపల్లిలో పని చేసిన సూర్యప్రకాశ్ రామడుగు మండలం తిరుమలాపూర్‌కు, చిన్నముల్కనూర్‌లో పని చేసిన జ్యోతి శంకరపట్నం మండలం కన్నాపూర్‌కు, ఓగులాపూర్‌లో పని చేసిన హరీశ్ ఎలబోతారానికి బదిలీ అయ్యారు.

విద్యాప్రమాణాలు పెంచాలి

శంకరపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంచాలని మొలంగూర్ జిల్లాపరిషత్ ప్రధానోపాధ్యాయురాలు నీరజ అన్నారు. శంకరపట్నం, మానకొండూర్ మండలాల ఇంగ్లిష్ బోధన టీచర్ల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం మొలంగూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగింది. ఆర్పీలు ప్రవీణ్, లక్ష్మణ్‌రావు, శివకుమార్ పాల్గొన్నారు.

రామడుగు బ్రిడ్జిని పట్టించుకోండి

రామడుగు: రామడుగు సమీపంలో నిర్మించిన బ్రిడ్జి నిరుపయోగంగా మారిందని, ప్రభుత్వం చర్యలు చేపట్టేలా చూడాలని బీజేపీ మండల నాయకులు బీజేపీ శాసన సభాపక్ష నేత, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి అసెంబ్లీ వద్ద వినతి పత్రం అందజేశారు.